సాక్షి విజయనగరం

బుధవారం । 14 । జూన్ । 2023



పుష్పాలంకరణలో పైడితల్లి

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. - 8లో



ప్రాణ దాతలు

మనిషి మాత్రమే రక్తదానం చేసి ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్న వాస్తవం మేరకు దాతలు సకాలంలో స్పందించి రక్తదానం చేస్తున్నారు. - 8లో



అకడమిక్ క్యాలెండర్‌లో బుచ్చెంపేట పాఠశాలకు చోటు

ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన అడకమిక్ క్యాలెండర్‌లో బుచ్చెంపేట ఎంపీపీ పాఠశాల యాక్టివిటీకి చోటు దక్కిందని పాఠశాల ఉపాధ్యాయిని వడ్డి ఉషారాణి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల విడుదల

విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 17,238 మంది పరీక్షలకు హాజరుకాగా 11,475 మంది (66.57 శాతం) ఉత్తీర్ణులైనట్టు ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 16,655 మందికి 13,451 మంది (80.76శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ జాయింట్ సెక్రటరీ లక్ష్మునాయుడు



బహుమతులు పొందిన క్రీడాకారులతో రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ జాయింట్ సెక్రటరీ, క్రీడాధికారులు

రాజాం సిటీ: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ జాయింట్ సెక్రటరీ ఎ.లక్ష్మునాయుడు అన్నారు. రాజాం జీసీఎస్ఆర్ కళాశాలలో మంగళవారం స్పోర్ట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడా రంగంలో రాణించినవారికి ఉన్నత ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. బీఆర్ఏయూ స్పోర్ట్స్ అధికారిణి ప్రొఫెసర్ పి.సుజాత గత ఏడాది కాలంలో వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తమరావు, పీడీ చీకటి కేశవనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అప్పలనారాయణ

నెల్లిమర్ల రూరల్: ఆర్టీసీ ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాలని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ సూచించారు. బదిలీపై జిల్లా ప్రజా రవాణాధికారిగా జిల్లాకు విచ్చేసిన అప్పలనారాయణ కొండవెలగాడ గ్రామంలోని ఆమె నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బంగారమ్మ మాట్లాడుతూ అందరితోనూ సమన్వయంగా పనిచేసి విజయనగరం ఆర్టీసీ డిపోకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: విజయనగరం జిల్లా ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ కాలేజీలో శిక్షణకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ డీఎం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 ఏళ్లు నిండి, లైట్ వెహికల్ లైసెన్స్, డ్రైవింగ్‌లో ఏడాది అనుభవం కలిగినవారు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు అర్హులని తెలిపారు. 40 రోజుల పాటు శిక్షణకు రూ.23,600లు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 99592 25620, 98666 49336, 73829 24030 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బడి బస్సు భద్రమేనా?



స్కూల్ బస్సు ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు

- బస్సు సామర్థ్యాలను పరీక్షిస్తున్న రవాణాశాఖ అధికారులు
- ఫిట్‌నెస్ లేని బస్సులపై అధికారుల కొరడా
- 15 ఏళ్లు దాటిన బస్సుల రిజిస్ట్రేషన్ రద్దు
- జిల్లాలో 346 బస్సులు ఫిట్‌నెస్‌లో పాస్
- మరో 150 బస్సులకు పరీక్షలు చేస్తున్న అధికారులు

విజయనగరం క్రైమ్: పిల్లలను ప్రతిరోజూ పాఠశాలలకు తీసుకెళ్లే ప్రైవేటు స్కూల్స్ బస్సుల ఫిట్‌నెస్‌ను జిల్లా రవాణాశాఖ అధికారులు పరీక్షిస్తున్నారు. తుక్కు బస్సులను సీజ్ చేస్తున్నారు. 15 ఏళ్లు దాటి వినియోగించే బస్సుల రిజిస్ట్రేషన్‌లు రద్దుచేస్తున్నారు. విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళ్లి, తిరిగి ఇంటికి చేర్చేందుకు యాజమాన్యాలు సురక్షితమైన బస్సులను ఏర్పాటుచేయాలని సూచిస్తున్నారు. రోడ్డు నిబంధనలు కచ్చితంగా పాటించే బస్సుల రాకపోకలకు మాత్రమే అనుమతులు జారీ చేస్తున్నారు. పిల్లల సురక్షిత ప్రయాణమే తమ లక్ష్యమని స్పష్టంచేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 346 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లను అందజేశారు. మరో 150 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

బస్సు డ్రైవర్‌ల ఎంపిక కీలకం

స్కూల్ బస్సు డ్రైవర్ల ఎంపికలో కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. శిక్షణ పొందిన, ఆరోగ్యంగా ఉన్న డ్రైవర్లకు ఎక్కువ వేతనం చెల్లించాలన్న కారణంగా 60 ఏళ్లు నిండిన వారిని సైతం డ్రైవర్లగా నియమిస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే, డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించకూడదని, తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని, ప్రతీ మూడు నెలలకు ఒకసారి డ్రైవర్ బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలని రవాణాశాఖ అధికారులు స్పష్టంచేస్తున్నారు.

యాజమాన్యాలదే బాధ్యత

జిల్లాలో సుమారు 800కి పైగా స్కూల్ బస్సులు ఉన్నట్లు రవాణాశాఖ అధికారులు గుర్తించారు. వీటిలో 346 బస్సులకు ఇప్పటికే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. నిబంధనలు పాటించని బస్సులను తిరస్కరించారు. మిగిలిన బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు. అయితే, తిరస్కరణకు గురైన బస్సులను మరలా పరీక్షలు చేయించుకోవడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని అధికారులు అంటున్నారు. స్కూల్స్ పునఃప్రారంభం అయిన నేపథ్యంలో బస్సు భద్రత తప్పనిసరి అని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. బస్సులో సీట్లు, అద్దాలు, టైర్లు తదితర బస్సు సామగ్రి అన్నీ సక్రమంగా ఉన్నాయా? లేదా? అనేది చూసుకోవాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు. స్కూల్ బస్సులకు సంబంధించి 32 అంశాలతో కూడిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి. బస్సులో విద్యార్థుల వివరాలు పట్టిక నమోదు చేసి ఉంచాలి. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాల్సిన బాధ్యత ప్రైవేటు స్కూల్ బస్సు యాజమాన్యాలపై ఉంది.

ఈ నిబంధనలు తప్పనిసరి....

- బస్సు ముందు, వెనుక భాగాల్లో స్కూల్ బస్సు, ఆన్‌స్కూల్ డూటీ అని రాయాలి.
- బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్ ఉండాలి.
- బస్సులో అగ్ని ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉంచాలి.
- బస్సు కిటికీలకు నెట్ తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి.
- బస్సు తలుపులకు లాకింగ్ సిస్టమ్ పెట్టాలి.
- విద్యార్థులు తమ బ్యాగ్‌లను ఉంచేందుకు బస్సులోనే విడిగా స్థలం కేటాయించాలి.
- బస్సులో పిల్లల సాయం కోసం అటెండర్‌ను నియమించాలి.
- గంటకు 40 కిలోమీటర్ల వేగం మించకుండా స్పీడ్ గవర్నన్స్ ఏర్పాటుచేయాలి.
- డ్రైవర్‌కు లైసెన్స్‌తో పాటు కనీసం నాలుగేళ్ల అనుభవం ఉండాలి.



రవాణా శాఖ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న స్కూల్ బస్సు డ్రైవర్లు (ఫైల్)



స్కూల్ బస్సును పరీక్షిస్తున్న అధికారి

ఫిట్‌నెస్ చేయించుకోకపోతే బస్సులు తిరగనివ్వం



ప్రతీ స్కూల్ బస్సును సంబంధిత పాఠశాల యాజమాన్యాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించాలి. లేకపోతే అటువంటి బస్సులను తిరగనిచ్చే ప్రసక్తే లేదు. పాఠశాల భద్రత విషయంలో రాజీపడేది లేదు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. మరికొద్దిరోజుల్లో పాఠశాలలు తెరవనున్న నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకుని బస్సులు నడపాలి. పాఠశాలలు ప్రారంభం నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవు. 15 ఏళ్లు దాటిన బస్సులు, 15 ఏళ్లకు దగ్గరగా ఉన్న బస్సులు తుక్కుగా అమ్మేసి వాటి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ రద్దుచేసుకోవాలి.

– ఎ.వి.రమణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, విజయనగరం

విరివిగా రక్తదాన శిబిరాలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: రక్తదాన శిబిరాలు విరివిగా నిర్వహించేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్యాధికారులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎల్‌ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, డీఐఓ డాక్టర్ ఎస్.శృతి, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్‌ఓపై సస్పెన్షన్ ఎత్తివేత

వీరఘట్టం: వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీ ఎస్ఓ సీహెచ్ రోహిణిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరలా ఆమెకు రేగులపాడు ఎస్ఓగానే నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ నెలలో రేగులపాడు కేజీబీవీను విద్యాశాఖ రాష్ట్ర ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ సందర్శించినప్పుడు విధుల్లో లోపాలకు బాధ్యులుగా ఎస్ఓ రోహిణితో పాటు డీఈఓ, జీసీడీఓ, వీరఘట్టం ఎంఈఓలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అధికారులు ఇచ్చిన విచారణ నివేదిక మేరకు డీఈఓ, జీసీడీఓ, ఎంఈఓలపై ఉన్న సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. తాజాగా ఎస్ఓపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

టిడ్కో కాలనీలకు మౌలిక వసతులు



సారిపల్లి వద్ద నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



కొత్తపేట కుమ్మరవీధి పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

- సోనియానగర్, సారిపల్లి కాలనీలను సందర్శించిన కలెక్టర్ నాగలక్ష్మి
- లబ్ధిదారులు సంతృప్తి చెందేలా సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు
- ఫూల్‌బాగ్, కొత్తపేటలోని సచివాలయాలు, పాఠశాల, ఆరోగ్య కేంద్రాల తనిఖీ

విజయనగరం: పట్టణ పేదల కోసం నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని, పనుల నాణ్యతలో రాజీ పడొద్దని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పట్టణీకరణ ప్రమాణాలకు అనుగుణంగా యూజీడీ, విద్యుదీకరణ, అంతర్గత రోడ్లు, తాగునీటి వసతులు కల్పించాలని సూచించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్ణీత గడువులోగా లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సోనియానగర్, సారిపల్లిలోని టిడ్కో గృహ సముదాయాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల పనులను పరిశీలించారు. సారిపల్లిలో అన్ని రకాల పనులు పూర్తికావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. షెడ్యూల్ ప్రకారం 480 గృహాలను సంబంధిత లబ్ధిదారులకు వీలైనంత త్వరగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. సోనియానగర్‌లో విద్యుదీకరణ పనులు వీలైనంత త్వరగా ముగించాలని చెప్పారు. భూగర్భ డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, పైపులైన్ల పనులను సునిశితంగా పరిశీలించిన కలెక్టర్ టిడ్కో అధికారులకు పలు సూచనలు చేశారు.

- ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఫూల్‌బాగ్‌లోని వైఎస్సార్ అర్బన్ పీహెచ్‌సీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీలో మందుల నిల్వను పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు.
- ఫూల్‌బాగ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం, కొత్తపేట కుమ్మరవీధిలోని 17వ నంబర్ సచివాలయాన్ని, వివేకానంద ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ కల్పించిన ఆధునిక సదుపాయాలు బాగున్నాయని కితాబిచ్చారు. మధ్యాహ్న భోజనంలో భాగంగా వండిన పులిహోరాను రుచిచూశారు. పిల్లలకు రుచికరమైన భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. కొత్తపేట కుమ్మరవీధిలోని వివేకానంద ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా స్థాయి పెంచాలని స్థానిక 14వ డివిజన్ కార్పొరేటర్ రాజేష్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ డీఈఓ ద్వారా సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పర్యటనలో టిడ్కో ఈఈ జ్యోతి, ఇన్‌చార్జి కమిషనర్ ప్రసాదరావు, డీఎంహెచ్‌ఓ డా.భాస్కరరావు, డీఐఓ డా.శృతి, విజయనగరం తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ సత్యనారాయణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పులి సంచరిస్తోంది.. జాగ్రత్త!

మక్కువ:

మండలంలోని కొండరేజేరు గ్రామ సమీపంలో సోమవారం రెండు ఆవులపై పులి దాడిచేసి హతమార్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మక్కువ ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు మంగళవారం మండలంలోని మేళాపువలస, ములక్కాయవలస, కాశీపట్నం, కొండరేజేరు, పాపయ్యవలస గ్రామాల్లో దండోరా వేయించారు. పులి సంచరిస్తోందని, ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగరాదన్నారు. పులి కనిపించినా ఎదురుదాడిచేయరాదన్నారు. పులిపై దాడిచేస్తే చట్టరీత్యానేరమన్నారు. మూగజీవులను ఆరుబయట కట్టరాదన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ బీట్ అధికారులు, సహాయబీట్ అధికారులు పాల్గొన్నారు.



మేళాపువలస గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్న అటవీశాఖ అధికారి నారాయణరావు, సిబ్బంది

పల్లె ప్రగతికి పెద్దపీట

- రాష్ట్రంలో నాలుగేళ్లుగా సంక్షేమ, అభివృద్ధి పాలన
- ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలతో పల్లెలకు కొత్త రూపు
- సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాలకు రూ.2.16కోట్లు జమ
- విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం
- మోసపూరిత హామీలివ్వడంలో చంద్రబాబు ఘనుడు
- జన్నివలస బీటీ రోడ్డును ప్రారంభించిన టీటీడీ బోర్డు ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి
- పాల్గొన్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎంపీపీ తదితరులు

రామభద్రపురం: రాష్ట్రంలో నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ సర్కారు సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తోందని, పల్లె ప్రగతికి అధిక ప్రాధాన్యమిస్తోందని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్, టీటీడీ బోర్డు చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. రామభద్రపురం మండలంలోని కొట్టక్కి కూడలి నుంచి జన్నివలసకు రూ.4 కోట్ల ఖర్చుతో నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అధ్యర్యంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. సంక్షేమ పథకాల కింద రాష్ట్రంలోని లబ్ధిదారుల ఖాతాలకు నాలుగేళ్లలో రూ.2.16లక్షల కోట్లు జమచేసినట్టు వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంక్షేమ పథకాలు కొనసాగించామన్నారు. మోసపూరిత హామీలు ఇవ్వడంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఘనుడని విమర్శించారు. రైతుల రుణాలు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానన్న హామీతో 2014 ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తూతూ మంత్రంగా మాఫీచేస్తూ వారికి ఆవేదన మిగిల్చారన్నారు. దోచుకు తినడంలో చంద్రబాబు దేశానికే ఆదర్శంగా నిలుస్తాడని విమర్శించారు. ఇటీవల జరిగిన టీడీపీ మహానాడులో ఆ పార్టీ మినీ మేనిఫెస్టో విడుదల చేసిందని, అందులోని హామీలన్నీ మన రాష్ట్రంలో అమలువుతున్న కొన్నింటిని, పొరుగు రాష్ట్రం కర్ణాటకలో అక్కడి పార్టీలు ప్రకటించిన మరి కొన్నింటిని కాపీ కొట్టినవని పేర్కొన్నారు. ఉచిత పథకాలతో రాష్ట్రం మరో సోమాలియా, శ్రీలంక అయిపోతుందన్న చంద్రబాబే మళ్లీ ఉచిత హామీల బాట పట్టడం విడ్డూరంగా ఉందన్నారు. పూటకో మాట మాట్లాడే ఆయనను ప్రజలు నమ్మడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, సర్పంచ్ సారంగదొర, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయలు, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండలాధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు, తెర్లాం ఎంపీపీ ఎస్.ఉమాలక్ష్మి, బొబ్బిలి జెడ్పీటీసీ సభ్యురాలు శాంతికుమారి, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొనారు.



జన్నివలస రోడ్డును ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, పాల్గొన్న జిల్లా నేతలు

పులిహోర మేనిఫెస్టోను నమ్మొద్దు..



ఇటీవల టీడీపీ మహానాడులో చంద్రబాబు విడుదల చేసిన పులిహోర మేనిఫెస్టోను నమ్మొద్దని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రజలకు హితవుపలికారు. వైఎస్సార్‌సీపీ అమలుచేస్తున్న పథకాలతో పాటు, పొరుగు రాష్ట్రం మేనిఫెస్టోను టీడీపీ కాపీ కొట్టిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసినా, పేదవారికి ఇళ్లు ఇచ్చినా మంచిది కాదని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు వాటినే అమలు చేస్తాన ఎలా చెబుతున్నారన్నారు. 2014లో బాబు వస్తే జాబు వస్తుందని చెప్పిన చంద్రబాబు ఎంత మందికి జాబులిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఉద్యోగావకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్య లేకుండా చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందనారు.

పేదలు-పెత్తందారుల మధ్యే పోరాటం



2024లో జరగనున్న ఎన్నికల్లో పేదవాడి అభివృద్ధికి.. పెత్తందారుల పెత్తనం మధ్య పోరాటం జరగనుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ నాయకులు ఓట్ల కోసం కళ్ల బొల్లి మాటలు, కాకమ్మ కబుర్లు చెప్పుకొని వస్తారని, ప్రజలు జాగురుకతతో వ్యవహరించాలన్నారు. ఎవరి పాలనలో అధిక లబ్ధికలిగిందో అంచనా వేయాలన్నారు. రైతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ ఏడాది జిల్లాలో రూ.1200 కోట్ల విలువైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, యంత్రపరికరాలు సమకూర్చుతున్నట్టు చెప్పారు. ప్రతి ఎకరాకు నీరందించాలన్న ఉద్దేశంతో తోటపల్లి, పెద్దగెడ్డ ప్రాజెక్టుల ద్వారా ఈ ఏడాది ముందుగానే సాగునీరు విడిచిపెట్టేందుకు కృషిచేస్తున్నామన్నారు.

బీసీల ఐక్యత చూపాలి



2024 ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. బొబ్బిలి నియోజకవర్గంలో సుమారు రూ.87 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత 15 ఏళ్లలో ఎప్పుడూ.. ఎక్కడా జరగని అభివృద్ధిని చేసినట్టు వెల్లడించారు. రాజరికం వెల్లబెడుతున్నవారు తమ ఆస్తులను ఎలా కాపాడుకోవాలి? మరింత ఆస్తులు ఎలా కూడ బెట్టుకోవాలో ఆలోచిస్తున్నారే తప్ప ప్రజలు బాగోగులను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. 2024 ఎన్నికల్లో బీసీలు కాని రాజులకు ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

కూలిపోయిన ఆస్పత్రి గోడ


కూలిపోయిన పశుసంవర్ధ కశాఖ ఎ.డి కార్యాలయం, ఆస్పత్రి గోడ

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలోగల పశుసంవర్ధ కశాఖ ఎ.డి కార్యాలయం, ఆస్పత్రి గోడ ఆకస్మికంగా కూలిపోయింది. మంగళవారం సిబ్బంది పనుల్లో ఉండగా ఉన్నట్లుండి భారీ శబ్దంతో గోడ పడిపోవడంతో అంతా పరుగులు తీశారు. కాలం చెల్లిన భవనం కావడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పేర్కొంటున్నారు. అయితే అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్రమంలో విద్యుత్ మీటర్, వైర్లు పాడవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు.

30 మద్యం సీసాల స్వాధీనం

దత్తిరాజేరు: అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిల్స్ పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ బూర్జవలస ఎస్సై రాజేష్ మంగళవారం తెలిపారు. షికారుగంజి గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు అదే గ్రామంలో గ్రామానికి చెందిన సదాశివరావును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జామిలో 140 మద్యం బాటిల్స్..

జామి: మండలకేంద్రం జామిలో పోలీసులు మంగళవారం 140 మద్యం బాటిల్స్ పట్టుకున్నారు. స్థానిక పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న రాజాన శ్రీనివాసరావు పాన్‌షాపులో మద్యం బాటిల్స్ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేశారు. మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని రాజాన శ్రీనివాస రావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదు

సాలూరు: తనపై దాడిచేశారని బాధితురాలైన బాలిక ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, తమ స్నేహితుడిని ప్రేమించాలంటూ పట్టణంలోని ఓ అమ్మాయిని బెదిరించిన ఆ విద్యార్థి సహా, స్నేహితులు ఐదుగురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బొలెరో ఢీకొని ఏఎన్‌ంకు గాయాలు


చికిత్స పొందుతున్న ఏఎన్ఎంసరోజిని

పార్వతీపురం: పార్వతీపురం మండలం కవిటిభద్ర గ్రామానికి చెందిన ఏఎన్ఎం ఎం. సరోజినిని బొలెరో వాహనం ఢీకొట్టడంతో గాయపడింది. గంగాపురం సచివాలయంలో పనిచేస్తున్న ఆమె మంగళవారం ఉదయం ఆమె సచివాలయం నుంచి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి స్కూటీపై వస్తుండగా వెంకంపేట రెవెన్యూ పరిధిలో వెనుకనుంచి పార్వతీపురం వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సరోజని రోడ్డుపై పడిపోవడంతో పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు చికిత్సకోసం ఆమెను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

కొమరాడ: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద 70 నుంచి 75 వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. ఈ సమాచారాన్ని కొమరాడ పోలీసులకు చేరవేయడంతో సంఘటనా స్థలానికి వచ్చిన ఎస్సై జగదీష్‌నాయుడు మృతదేహాన్ని పరిశీలించిన స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. వారం రోజులుగా ఈ వృద్ధుడు చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ ఉండేవాడని, వివరాలు తెలియరాలేదని, ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వాలని ఎస్సై తెలియజేశారు.

ప్రాణదాతలు

- రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడి ఆపద్బాంధవులవుతున్న దాతలు
- మండు వేసవిలో సైతం స్వచ్ఛందంగా రక్తదానం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం


రక్తం ఇస్తున్న దాతలు

జిల్లాలో రక్తసేకరణ వివరాలు	
సంవత్సరం	సేకరించిన రక్తం (యూనిట్లు)
2017-18	16, 747
2018- 19	20,194
2019-20	17, 758
2020-21	13,992
2021-22	16,686
2022-23	20,755
2023-24	3,943

విజయనగరం ఫోర్ట్/రాజాం సిటీ: మనిషి మాత్రమే రక్తదానం చేసి ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్న వాస్తవం మేరకు దాతలు సకాలంలో స్పందించి రక్తదానం చేస్తున్నారు. గర్భిణుల ప్రసవ సమయంలో, శస్త్రచికిత్స చేసే సమయంలో, రక్తహీనత ఉన్న వారికి, కేన్సర్, తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా రోగులకు , రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్ర రక్తస్రావం అయిన వారికి రక్తం ఎక్కువగా అవసరం ఉంటుంది. రక్తాన్ని పరిశ్రమల్లో తయారు చేయలేరు. దాతలే రక్తదానం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రక్తం అవసరాలు తీరుతున్నాయంటే అది దాతలే వల్లే. రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ఏటా జూన్ 14వ తేదీన ప్రపంచ రక్త దాతల దినోత్సవం నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం.

అరుదైన బ్లడ్ గ్రూపులు

ఎనెగిటివ్, బినెగిటివ్, ఎబి నెగిటివ్ బాంబే బ్లడ్ గ్రూప్, ఏబీ పాజిటివ్ అరుదైన బ్లడ్ గ్రూపులు. ఈ గ్రూపుల రక్తం కొంతమందికే ఉంటుంది. ఈ గ్రూప్‌ల రక్తం సకాలంలో దొరకకపోతే శస్త్రచికిత్సలు వాయిదా పడతాయి. అదేవిధంగా రోగుల ప్రాణం మీదకు కూడా వస్తుంది.

స్వచ్ఛందంగా రక్తం ఇస్తున్న దాతలు

సాధారణ గ్రూపులైన ఎపాజిటివ్, బిపాజిటివ్, ఒ పాజిటివ్ గ్రూపు రక్తం అందుబాటులో ఉంటుంది. అరుదైన ఎనెగిటివ్, బినెగిటివ్, ఓనెగిటివ్, ఏబీ నెగిటివ్ గ్రూపుల రక్త నిల్వలు తక్కువగా ఉంటాయి. అయితే నెగిటివ్ గ్రూపు గల రోగి బంధువులు తమ వారికి రక్తదానం చేయాలని కోరిన వెంటనే స్పందించి దాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేస్తుండడంతో వారిని పలువురు అభినందిస్తున్నారు.

రక్తదానం వల్ల ప్రయోజనాలు

రక్తదానం అనేది ఒకరి ప్రాణాలను రక్షించడంలో సహాయ పడే గొప్ప దానం. అయితే కొందరు తాము రక్తదానం చేయడం వల్ల ఏదైనా అనారోగ్యం వస్తుందేమోనని సందేహిస్తారు. నిజానికి రక్తదానం చేయడం వల్ల దాతకు అనేక ప్రయోజనాలు ఉంటాయి.

బరువు తగ్గించవచ్చు

ఆరోగ్యకరమైన వ్యక్తులు సమయానుకూలంగా రక్తదానం చేయడం వారి బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. శరీరంలో సామర్థ్యం పెరుగుతుంది.

రోగనిరోధక శక్తి పెరుగుదల

వివిధ రకాల అనారోగ్య కారణాలను నివారించడానికి ఇమ్యూనాలజీ కీలకం. రక్తదానం చేస్తూ ఉండడం వల్ల శరీరంలో ఏదైనా అనారోగ్య సమస్యను గుర్తించవచ్చు. రక్తం ఇవ్వడం వల్ల శరీరంలోని పాత రక్తం పోయి కొత్త రక్తం ఉత్పత్తి అవుతుంది. బ్లడ్ ప్లాస్మా కూడా పునరుజ్జీవం పొంది ల్యూకో సైటల పెరుగుదలలో సహాయపడుతుంది. ఈ ల్యూకోసైట్‌లు వివిధ అనారోగ్యాల నుంచి రక్షించే రోగనిరోధక కణాలు.కావున రక్తదానం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యం బాగుపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా రక్తదానం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. క్యాన్సర్ వ్యాధిని దూరం చేస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని రక్తదానం మెరుగుపరుస్తుందని వైద్యులు చెబుతున్నారు.

రక్తదానానికి అర్హులు....

- అపోహలువీడి రక్తదానం చేయాలనుకునేవారు ఆరోగ్యంగా ఉండడంతోపాటు 18 నుంచి 60 ఏళ్ల లోపు వయసు, 50 కిలోల బరువు కలిగి ఉండాలి..
- హిమోగ్లోబిన్ శాతం 12.5 ఉండాలి.

చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, ఇతర వ్యాధులు సోకిన వారు నయమైన తరువాత నాలుగు నుంచి ఆరు నెలల అనంతరం రక్తదానం చేయవచ్చు.

- రక్తదానం చేసేవారి నుంచి కేవలం 300 మిల్లీ లీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.
- రక్తాన్ని సేకరించే ముందు వైద్యులు దాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు.


రాజాం సిటీ: జీఎంఆర్ ఐటీలో రక్తదాన శిబిరం (ఫైల్)

వీరు అనర్హులు....

- మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తం ఇవ్వకుండా ఉండాలి.
- కంటి జబ్బులు, కంటి కలక వంటివి ఉన్నప్పుడు రక్తదానం చేయవద్దు.

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది:



అన్ని దానాలకన్నా రక్తదానం గొప్పది. రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తం ఇవ్వడం అభినందనీయం. రక్తదానం చేయడమంటే ప్రాణాలు నిలపడమే. వేసవిలో సైతం రక్తదానానికి ముందుకు రావడం గొప్ప విషయం. రక్తదాతలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్ఓ

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక పూల అలంకరణలో పైడితల్లి అమ్మవారు


తలపై ఘటంతో మహిళ


బాధ్యతలు చేపట్టిన దేవాదాయ శాఖ ఎ.సి అన్నపూర్ణను పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న పైడితల్లి ఆలయ ఈఓ, మాజీ ఎ.సి కేఎల్.సుధారాణి


సిల్వర్ జూబ్లీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువ జాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, దూసి శివప్రసాద్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారికి తీపిపదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావి చెట్లవద్ద దీపారాధన చేశారు. ఆలయ ఈఓ కేఎల్. సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పైడిమాంబ సిల్వర్‌జూబ్లీ పుస్తక ఆవిష్కరణ

శ్రీపైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవాసంఘం 25వ వార్షికోత్సవానికి సంబంధించి సిల్వర్ జూబ్లీ పుస్తకాన్ని లేడీస్ క్లబ్‌లో మంగళవారం ఆవిష్కరించారు. సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో నేతృత్వంలో ఆధ్యాత్మిక అంశాలతో కూడిన పుస్తకాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఆర్.సూర్యపాత్రో మాట్లాడుతూ అమ్మవారిపై రూపకల్పన చేసిన చిత్రానికి సంబంధించి వాయిస్ ఓవర్ చేయడానికి హైదరాబాద్ వెళ్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పండగకు అమ్మవారి చిత్రాన్ని భక్తులకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటం వద్ద పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భీష్మ, బంగారు నాగప్రకాశ్, జి.వెంకటరెడ్డి, తాడిరాజు, సామవేదుల గీతారాణి, కొమ్మ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఎ.సిగా అన్నపూర్ణ

దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా టి.అన్నపూర్ణ నియమితులయ్యారు. గతంలో ఆమె విజయనగరం పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈఓగా పనిచేశారు. అనంతరం అనకాపల్లి నూకాలమ్మ తల్లి ఆలయ ఈఓగా, శ్రీకాకుళం అసిస్టెంట్ కమిషనర్‌గా ఎన్‌టీఆర్ జిల్లా ఎ.సిగా పనిచేసి, విజయనగరం బదిలీపై వచ్చారు. అందరి సహాయ, సహకారాలతో జిల్లాలో ఉన్న ఆలయాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఇప్పటివరకూ ఎ.సిగా పనిచేసిన కేఎల్.సుధారాణి నుంచి బాధ్యతలు స్వీకరించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,450-00
బంగారం(22కి. 10గ్రా.)	55,400-00
వెండి (కిలో)	79,300-00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹173	₹316	₹ 326

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న అనిత


చికిత్స పొందుతున్న రవీంద్రకుమార్

పార్వతీపురం: భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా భార్య పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం టేకులోవ గ్రామానికి చెందిన ఎస్.అనితకు భర్త వెంకటరమణ చిన్నచిన్న విషయాలకు తరచూ గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన ఆమె పురుగు మందు తాగేసింది. గమనించిన కుటుంబసభ్యులు జోకిశీల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది.

భార్య కాపురానికి రావడం లేదని భర్త..

పార్వతీపురం: భార్య కన్నవారి ఇంటినుంచి కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం బక్కుపేటకు చెందిన ఎం.రవీంద్రకుమార్‌కు 10ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శ్రావణితో వివాహం అయింది. వారిద్దరి మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా శ్రావణి కన్నవారింటికి వెళ్లిపోయింది. తన భార్యను తీసుకురావడానికి రవీంద్ర కుమార్ మంగళవారం అత్తవారింటికి వెళ్లగా మద్యం మానేస్తే వస్తానని ఆమె తెగేసి చెప్పింది. దీంతో మనస్థాపం చెందిన రవీంద్రకుమార్ ఇంట్లో ఉన్న టర్పన్‌టాయిల్‌ను తాగేశాడు. ఈ విషయం గమనించిన చుట్టు పక్కల వారు ప్రాథమిక చికిత్స అందించిన తరువాత పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం


అపోలో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సత్యవేణి

రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు రెడ్డి సత్యవేణి తల్లిదండ్రులు రమణమ్మ, నారాయణరావులు కృతజ్ఞతలు తెలియజేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సత్యవేణిని వెంటబెట్టుకుని ఆమె తల్లిదండ్రులు వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థతో కలిసి గత నెలలో భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. వెంటనే స్పందించిన సీఎం ఆ చిన్నారికి ఆపరేషన్ చేయించాలని తన వ్యక్తిగత కార్యదర్శులను ఆదేశించారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఆపరేషన్ నిమిత్తం రూ.11 లక్షలు మంజూరుచేయగా, విశాఖపట్నంలోని అపోలో ఆస్పత్రిలో వైద్యులు చిన్నారికి మంగళవారం ఆపరేషన్ చేసినట్లు తల్లిదండ్రులు వెల్లడించారు. చిన్నారి పూర్తిగా కోలుకునేంతవరకూ వైద్యసాయం అందిస్తామని సీఎంఓ అధికారులు తెలిపారన్నారు. తమ చిన్నారి ప్రాణాలను కాపాడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామంటూ భావోద్వేగానికి గురయ్యారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కోర్సులలో 2 నుంచి 3 నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నామని విజయనగరం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నీలం గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రం శివారు కొండకరకాం గ్రామం వద్ద ఉన్న కేంద్రియ గిరిజన విశ్వ విద్యాలయం, వీటీ అగ్రహారం , బీసీ కాలనీ వద్ద ఉన్న నేక్ శిక్షణ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లలో శిక్షణ అందజేస్తామన్నారు. కనీసం ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత సాధించి, 18 ఏళ్ల నించి 45 ఏళ్ల లోపు నిరుద్యోగ యువత ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతకు సర్వేయర్ కోర్సు రెండు నెలల పాటు అందిస్తామన్నారు. అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ కోర్సుకు ఎనిమిదో తరగతి ఆపైన చదివిన యువతకు మూడు నెలల కోర్సుపై శిక్షణ ఉంటుందన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు పదో తరగతి, హెల్పర్ మేషన్ కోర్సుకు ఐదో తరగతి ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9652515251, 7075342406, 9866564273, 9948127818 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

శ్రీశ్రీ కళావేదిక జిల్లా కార్యవర్గం ఎంపిక

గుమ్మలక్ష్మీపురం: శ్రీశ్రీ కళావేదిక పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.దేవానంద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు గౌరవ అధ్యక్షుడిగా రౌతు వాసుదేవరావు, గౌరవ సలహాదారుగా ఎస్.బాలకృష్ణ, మహిళా అధ్యక్షురాలిగా రెడ్డి పద్మావతి, ఉపాధ్యక్షులుగా తాడుతూరి వెంకటరమణారావు, ప్రధాన కార్యదర్శిగా శైలజ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.హరగోపాల్‌తో పాటు కార్యదర్శులుగా బి.ఉమామహేశ్వరరావు, ఎస్.సూర్యనారాయణ, చల్లా చంద్రశేఖర్, వి.కొండలరావు, పి.శేషగిరిరావు, పి.నిర్మల్‌కుమార్‌లను ఎంపిక చేసినట్లు చెప్పారు. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అయిన శ్రీశ్రీ కళావేదిక 21 ప్రపంచ రికార్డులు సాధించిన సంస్థ అని ఈ సందర్భంగా దేవానంద్ పేర్కొన్నారు.

అకడమిక్ క్యాలెండర్‌లో బుచ్చెంపేట పాఠశాలకు చోటు


కథల పుస్తకాలపై స్టిక్కర్లు అతికిస్తున్న యాక్టివిటీ


అకడమిక్ క్యాలెండర్ జనవరి 2024 పేజీలో చోటు సంపాదించిన బుచ్చెంపేట పాఠశాల యాక్టివిటీ

రాజాం సిటీ: ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన అడకమిక్ క్యాలెండర్‌లో మున్సిపాల్టీ పరిధి బుచ్చెంపేట ఎంపీపీ పాఠశాల యాక్టివిటీకి చోటు దక్కిందని పాఠశాల ఉపాధ్యాయిని వడ్డి ఉషారాణి తెలిపారు. విద్యార్థులతో చేయించిన పలు అంశాలను ఫ్రూట్స్ గ్రూపులో అప్‌లోడ్ చేశామని, దీనిని ఎస్‌సీఈఆర్‌టీ గుర్తించిందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ ఫ్రూట్స్ గ్రూప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులంతా విద్యార్థులకు నెలనెలా చేయాల్సిన అంశాలపై చర్చిస్తామన్నారు. ఇలా చర్చించిన అంశాలపై విద్యార్థులతో యాక్టివిటీ చేయించి గ్రూపుల్లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. యాక్టివిటీల ద్వారా విద్యార్థుల్లో కథలతోపాటు పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వీలుకలుగుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నెల్లూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ 550 కథల పుస్తకాలను సమకూర్చిందని, ప్రతి పుస్తకాన్ని విద్యార్థులే స్వయంగా చదివి అర్థం చేసుకుని ఆ సంస్థ అందించిన స్టిక్కర్లను వాటికి అందించాలని చెప్పారు. ఇలా చేసిన యాక్టివిటీని ఫ్రూట్స్ గ్రూపులో పెట్టినట్లు చెప్పారు. ఆ గ్రూపులో నచ్చిన అంశాలను ఎస్‌సీఈఆర్‌టీ అకడమిక్ క్యాలెండర్‌లో ప్రచురిస్తారని తెలిపారు. ఇలా తమ పాఠశాల యాక్టివిటీని జనవరి 2024 క్యాలెండర్‌లో ముద్రించడం ఆనందంగా ఉందన్నారు. యాక్టివిటీ అకడమిక్ క్యాలెండర్‌లో చోటు సంపాదించడం పట్ల ఎంఈఓ పి.నాగయ్య, ఇతర ఉపాధ్యాయులు సహచర ఉపాధ్యాయిని ఉషారాణిని అభినందించారు.